క్లుప్తంగా

వెంకన్నకు విశేషంగా అభిషేకం



వెంకన్నకు అభిషేకం నిర్వహిస్తున్న అర్చకుడు

పెందుర్తి: వేంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామికి శుక్రవారం ఉదయం పంచామృతాభిషేకం విశేషంగా నిర్వహించారు. అనంతరం స్వామికి విశేష పూజలు జరిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు రామానుజమ్ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

అమ్మవార్లకు ఘనంగా తిరువీధి



తిరువీధిలో అమ్మవార్లకు హారతి ఇస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం సింహవల్లీ తాయారు, చతుర్భుజ తాయారు అమ్మవార్లకు విశేషంగా తిరువీధి నిర్వహించారు. అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకిలో అధిష్ఠింపజేశారు. నాదస్వర వాయిద్యాల మధ్య బేడా మండపంలో తిరువీధి జరిపారు. విశేష హారతులందించారు. అర్చకుడు చక్రవర్తి తదితరులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

అప్పన్న సన్నిధిలో యదుగిరి యతిరాజ జీయర్‌స్వామి



సింహగిరిపై యదుగిరి యతిరాజ జీయర్‌స్వామి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని యదుగిరి యతిరాజ మఠం పీఠాధిపతి యదుగిరి యతిరాజ జీయర్‌స్వామి శుక్రవారం దర్శించుకున్నారు. ఆయనకు పూర్ణకుంభంతో అర్చకులు స్వాగతం పలికారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అంతరాలయంలో స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అనంతరం ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి శేషవస్త్రం, ప్రసాదం, జ్ఞాపికలను ప్రొటోకాల్ ఏఈవో రాంబాబు అందించారు. దేవస్థానం ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, సూపరింటెండెంట్ జీవీవీఎస్‌కే ప్రసాద్ తదితరులు స్వామీజీకి స్వాగతం పలికారు.

97వ వార్డులో ఎమ్మెల్యే పర్యటన



ఎమ్మెల్యే పంచకర్లకు సమస్యలు విన్నవిస్తున్న స్థానికులు

పెందుర్తి: 97వ వార్డు పరిధి దుర్గానగర్ కాలనీ, వికలాంగుల కాలనీ, కుమ్మరి కాలనీ, నరవవానిపాలెం, పులగానిపాలెం, అయ్యప్పనగర్ కాలనీలో శుక్రవారం ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, డ్రైన్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే రోడ్లు, కాల్వల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించాల్సిందిగా జీవీఎంసీ జోన్-8 అధికారులను ఆదేశించారు. వార్డులో ఆక్రమణలను గుర్తించి, ప్రభుత్వ భూముల్ని సంరక్షించాలని సూచించారు. పర్యటనలో కార్పొరేటర్ సేనాపతి వసంత, అవగడ్డ అప్పలనాయుడు, సేనాపతి సోమశేఖర్ నాయుడు, ఎ.సింహాచలం, శ్రీనివాసరావు, గీతం నాయుడు, కిషోర్, సాహు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం.. రసాయన ఎరువులు, పురుగు మందుల అవసరం లేనిది. మన వద్ద సుభాష్ పాలేకర్ పద్ధతి(బీజామృతం, జీవామృతం, మల్చింగ్, నీటి యాజమాన్యం)ని రైతులు ఎక్కువగా ఆచరిస్తున్నారు. ఈ సాగులో ద్రవ, ఘన జీవామృతం వంటి సేంద్రియ ఎరువులు, విత్తన శుద్ధికి బీజామృతం, కీటక నాశనులుగా నీమాస్త్రం, అగ్ని అస్త్రం, బ్రహ్మాస్త్రం వంటివి రైతులే సొంతంగా తయారు చేసుకుంటారు. ఇదే మార్గంలో సబ్బవరం మండలంలోని రైతులు తక్కువ పెట్టుబడితో ఆరోగ్యకర ఉత్పత్తులను సాధించి, అధిక ఆదాయం పొందుతున్నారు.





అమృతపురంలో కోతకు సిద్ధంగా ఉన్న ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన వరి పంట



ఏటీఎం మోడల్‌లో ఉద్యాన పంటలు సాగుచేస్తున్న రైతులు

ప్రకృతి సేద్యం.. భూసారం భద్రం

సబ్బవరం: ఆధునిక వ్యవసాయంలో ప్రమాదకరమైన రసాయనాల వినియోగంతో రైతులు మెరుగైన దిగుబడులు సాధిస్తున్నారు. అయినప్పటికీ వాటిని తినే ప్రజలు అనారోగ్యాలకు గురి కావడంతోపాటు, భూసారం క్రమేపీ క్షీణిస్తూ నిస్సారమవుతోంది. ప్రకృతి వ్యవసాయంలో ఆరోగ్యవంతమైన దిగుబడులతోపాటు, భూములు సారవంతంగా మారతాయి. దీంతో సబ్బవరం మండంలోని పలు గ్రామాల రైతులు ప్రకృతి సేద్యం వైపు మొగ్గు చూపుతున్నారు. తక్కువ పెట్టుబడి, నీటి యాజమాన్య పద్ధతులతో అధిక ఆదాయం పొందుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహం అందిస్తున్నాయి.

- మండలంలోని ఎల్లుప్పి, బోదువలస, మల్లునాయుడుపాలెం, మొగలిపురం గ్రామాల్లో అధికంగా వరి, అక్కడక్కడా ఉద్యాన పంటలైన మామిడి, వంగ, టమాట, మిరప పండిస్తున్నారు. సాధారణ పంటల కంటే మెరుగైన ఆదాయం పొందుతున్నారు.
- అమృతపురం, తవ్వవానిపాలెం వంటి గ్రామాలు మండల కేంద్రం సబ్బవరానికి అతి సమీపం కావడం, మార్కెటింగ్ సదుపాయం అధికంగా ఉండటంతో టమాట, వంగ, బెండ, ముల్లంగి, క్యాబేజీ, మిర్చితో పాటు పలు రకాల ఆకు కూరలను నిత్యం సాగుచేస్తున్నారు.

మూడు యూనిట్లుగా..

మండలంలోని గ్రామాలను మూడు యూనిట్లుగా విభజించి ప్రకృతి వ్యవసాయం సాగుచేస్తున్నారు. అమృతపురం, తవ్వవానిపాలెం, పెదనాయుడుపాలెం, ఆదిరెడ్డిపాలెం, గొటివాడ, మల్లునాయుడుపాలెం, మొగలిపురం, ఎల్లుప్పి, బోదువలస, అయ్యన్నపాలెం గ్రామాల్లో రైతులు ప్రకృతి సేద్యంలో ఉన్నారు.

అందుబాటులో ఉన్న వనరులతోనే..

రైతులు అందుబాటులో ఉండే వనరులను సద్వినియోగం చేసుకుని ఎరువులు, క్రిమి సంహారక మందులను తయారు చేసుకుంటున్నారు. ఆవు పేడ, గో మూత్రం, శనగపిండి, బెల్లం, పుట్ట మన్ను వంటివి వినియోగించి ఘన జీవామృతం, ద్రవ జీవామృతం తయారుచేసి ఎరువులుగా వినియోగిస్తున్నారు. పురుగులు, తెగుళ్ల నివారణకు నియమాస్త్రం, బ్రహ్మాస్త్రం, దశపర్ణి కాషాయం, అగ్నిఅస్త్రం, జిల్లేడు ద్రావణం వంటివి రైతులే స్వయంగా తయారు చేసుకుంటున్నారు. దీంతో చాలా వరకు పెట్టుబడి భారం లేకుండా ప్రకృతి సేద్యం జరుగుతోంది.

ప్రకృతి సేద్యంతో ప్రయోజనాలు

- ఈ విధానంలో వ్యవసాయం ద్వారా క్రిమిసంహారక మందుల వినియోగాన్ని అంచెలంచెలుగా తగ్గించి భూసారాన్ని పెంచవచ్చు.
- ప్రకృతి సిద్ధంగా లభించే ఎరువులు, రసాయనాలు మాత్రమే వాడటం ద్వారా భూమి ఆరోగ్యవంతంగా తయారవుతుంది.
- ప్రకృతి సేద్యంలో ఆరోగ్యకర ఉత్పత్తులు సాధ్యమవుతాయి. వీటికి మార్కెట్లో రెట్టింపు ధర, డిమాండ్ ఉంది.
- నీటి ఎద్దడిని తట్టుకునేందుకు నీటి యాజమాన్య పద్ధతుల అమలు వల్ల సాగునీరు ఆదా అవుతుంది.
- ప్రకృతి వ్యవసాయంలో పెట్టుబడి లేని సాగువైపు రైతులకు ప్రోత్సాహం ఉంటుంది.

అవగాహన.. ప్రోత్సాహం

ప్రకృతి వ్యవసాయ సాగుకు రైతు సాధికారిక సంస్థల ద్వారా వ్యవసాయ శాఖ ముందుగానే ఆసక్తి గల కొంత మంది రైతుల్ని ఎంపిక చేస్తుంది. దీనిపై ఆయా గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. స్థానిక నేతలు, అవగాహన కలిగిన రైతుల ప్రోత్సాహంతో ప్రకృతి వ్యవసాయాన్ని ఆయా గ్రామాల్లో చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుని, కార్యాచరణ చేపడతారు.

అధిక ధరతో మెరుగైన రాబడి



రెండెకరాల్లో సోనామసూరి రకం వరిని ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేస్తున్నా. పంట ఆరోగ్యంగా ఉండి కోత దశకు వచ్చింది. గతంలో ఎర్ర తెగులు ఆశిస్తే ఆవు పేడ, మూత్రం, ఇంగువ, సున్నంతో తయారు చేసిన ద్రావకాన్ని 10 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేశా. తెగులు అదుపులోకి వచ్చింది. వీటితో పాటు ఎకరంలో టమాటా, 30 సెంట్లలో కీరాదోస, 10 సెంట్లలో ఆనప వేశాను. పండిన పంటను మార్కెట్ చేసుకునేందుకు గోపాలపట్నం రైతు బజార్‌లో మాకు స్టాల్ కేటాయించారు. పూర్తిగా ప్రకృతి సేద్య ఉత్పత్తులు కావడంతో అధిక ధర వస్తోంది.

– గండి ముత్యాలనాయుడు, అమృతపురం

అన్ని గ్రామాలకు విస్తరించేలా..



మండలంలోని అన్ని గ్రామాలలో ప్రకృతి సేద్యం విస్తరించేలా కృషి చేస్తున్నాం. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే పంటల మార్కెటింగ్‌కు ప్రత్యేక స్టాళ్ల ఏర్పాటు కోసం ప్రణాళికలు రూపొందించాం. ప్రస్తుతం ప్రకృతి సేద్యం చేస్తున్న రైతులు శతశాతం ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవలంభించట్లేదు. ఏదో ఒక దశలో స్వల్ప మొత్తంలోనైనా రసాయనక ఎరువులు, పురుగు మందుల్ని వినియోగిస్తున్నారు. దీన్ని కూడా నియంత్రించి, పూర్తి స్థాయిలో ప్రకృతి సేద్యం జరిగేలా రైతుల్ని ప్రోత్సహిస్తున్నాం. ఇందుకు వివిధ స్థాయిల్లో 18 మంది సిబ్బంది పనిచేస్తున్నారు.

– బి.సింహాచలం, డివిజన్ ఇన్‌చార్జి (మాస్టర్ ట్రైనర్), ప్రకృతి వ్యవసాయం

'ఫెంగల్' ప్రభావంతో రైతుల్లో ఆందోళన



రాయపుర అగ్రహారంలో వరిచేను కుప్పలు వేసుకుంటున్న భార్యాభర్తలు

సబ్బవరం: ఫెంగల్ తుపాను హెచ్చరికల నేపథ్యంలో మండలంలో రైతులు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. ఇప్పటికే వరి కోతలు కోసిన రైతులు శుక్రవారం ఒక్కసారిగా వాతావరణం మారి చిరుజల్లులు పడటంతో ఆందోళన చెందారు. చేతి వరకూ వచ్చిన పంట నోటికి రాదేమోనన్న భయంతో ఎక్కడ కోసిన వరిచేనును అక్కడే కుప్పలు వేసే పనిలో నిమగ్నమయ్యారు. తుపాను ప్రభావంపై వాతావరణ శాఖతో పాటు వ్యవసాయ అధికారులూ హెచ్చరించారు. అయినప్పటికీ గత రెండు రోజులుగా వాతావరణం అనుకూలంగా ఉండటంతో బాగా పండిన వరి చేలను రైతులు కోసి, పనలేశారు. వాతావరణం మారి చిరు జల్లులు కురవడంతో శుక్రవారం ఎవరి చేలను వారే పంట పొలాల్లో కుప్పలు వేసుకుంటూ హడావుడిగా కనిపించారు.

ఆక్రమణలు అడ్డుకోలేకపోతే విధుల నుంచి తప్పుకోండి

- జోన్-8 సిబ్బంది తీరుపై ఎమ్మెల్యే పంచకర్ల ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల

పెందుర్తి: ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణలకు అడ్డుకట్ట వేయలేకపోతే విధుల నుంచి స్వచ్ఛందంగా తప్పుకోవాలని జీవీఎంసీ జోన్-8 అధికారులను ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు సూచించారు. 95వ వార్డు పరిధి ఓ ప్రైవేట్ కల్యాణమండపంలో జీవీఎంసీ జోన్-8 టౌన్‌ప్లానింగ్, వీఆర్వోలు, శానిటరీ విభాగం అధికారులు, సచివాలయ ఉద్యోగులతో శుక్రవారం ఆయన సమీక్ష నిర్వహించారు. జోన్‌లోని అన్ని వార్డుల్లో ఆక్రమణలు విపరీతంగా పెరిగిపోతున్నాయని, అధికారులు మొద్దునిద్ర వీడి వాటిపై దృష్టి సారించాలని హెచ్చరించారు. తన క్షేత్రస్థాయి పర్యటనల్లో ఎక్కువగా ఆక్రమణలపైనే ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. చెరువులు, గెడ్డలు, కొండవాలు ప్రాంతాలు ఆక్రమణలకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. తప్పుని ప్రోత్సహించేవారెవరైనా.. తన దృష్టికి వస్తే సహించేది లేదన్నారు. పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేదని, దీనిపై దృష్టిసారించాలన్నారు. అధికారులు, సిబ్బంది ప్రజా సమస్యలపై దృష్టిసారించి, ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలని సూచించారు. జోనల్ కమిషనర్ హైమావతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ ఆనంద్‌కుమార్, కార్పొరేటర్లు రాపర్తి కన్నా, బల్ల రాంబాబు, సేనాపతి వసంత, ఆయా వార్డుల టీడీపీ అధ్యక్షులు దాట్ల మధు, కంచిపాటి మధు, సేనాపతి సోమశేఖర్, పిన్నింటి పార్వతి, నాయకులు ఎ.సింహాచలం ,జగన్మోహన్, గొర్లె అప్పారావు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు



మద్యం షాపులో తనిఖీలు నిర్వహిస్తున్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డీసీ శ్రీరామచంద్రమూర్తి

సబ్బవరం: మండలంలోని పలు మద్యం షాపుల్లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీరామచంద్రమూర్తి శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సబ్బవరం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో సబ్బవరంలోని రమా వైన్స్, పయనీర్ వైన్స్, శ్రీశ్రీ వైన్స్‌లలో తనిఖీలు జరిపి, మద్యం విక్రయాల్లో నిబంధనలు పాటించాని నిర్వాహకులకు సూచించారు. మద్యం ధరల పట్టికను దుకాణాల ముందు ఏర్పాటు చేయాలన్నారు. 21 ఏళ్లలోపు వయసున్న వారికి మద్యం విక్రయించరాదన్నారు. సీసీ కెమెరాలు ఉన్నాయా? లేదా? ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ అనుమతులిచ్చిన చోటే షాపులు ఏర్పాటుచేశారా? తదితర అంశాలను ఆరా తీశారు. తొలుత సబ్బవరం ఎక్సైజ్ స్టేషన్‌ను పరిశీలించిన ఆయన పరిమితికి మించి మద్యం నిల్వలు ఉండకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఉదయం 10 నుంచి రాత్రి 10 వరకే షాపుల పనివేళల్ని పాటించాలన్నారు. తనిఖీల్లో ఆయన వెంట ఎక్సైజ్ సీఐ డి.అనిల్‌కుమార్ తదితరులు ఉన్నారు.

బాబూరావు కుటుంబానికి గండి రవి పరామర్శ



రాజేష్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గండి రవికుమార్ తదితరులు

సబ్బవరం: జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు బర్నికాన బాబూరావు చిన్న కుమారుడు రాజేష్ ఇటీవల అకాల మరణం చెందడంతో, బాబూరావును, ఆయన కుటుంబ సభ్యులను వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్ శుక్రవారం పరామర్శించారు. మండలంలోని ఎరుకునాయుడు పాలెంలో వారి నివాసంలో రాజేష్ చిత్రపటానికి పార్టీ శ్రేణులతో కలిసి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్నివ్వాలని భగవంతుని కోరుకుంటూ తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట అనకపల్లి ఎంపీటీసీ కర్రి అప్పారావు, పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడు యడ్ల నాయుడు, ఉప సర్పంచ్‌లు సిరపరపు వాసు, పార్టీ నాయకులు మొల్లి చిన్నారావు, ధూళి నరేష్, సేనాపతి దుర్గ అప్పారావు, బోలెం శంకర్, బోలెం రాజు, మంగబాబు, దాడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

పెందుర్తి: స్థానిక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనం నడిపిన ఏడుగురు మందుబాబులకు కోర్టు రూ.70 వేల జరిమానా విధించినట్లు పెందుర్తి ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం మీడియాకు తెలిపారు. పెందుర్తి స్టేషన్ లిమిట్‌లో ఇటీవల జరిగిన తనిఖీల్లో తాగి వాహనం నడుపుతున్న ఏడుగురిని గుర్తించి, శుక్రవారం రెండవ స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు న్యాయమూర్తి జరిమానా విధించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపి, ప్రమాదాల బారిన పడవద్దని హితవు పలికారు. మరోసారి దొరికితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బెల్ట్ షాపులు, అక్రమ మద్యంపై కఠిన చర్యలు

- ముగ్గురిపై కేసులు, నలుగురికి రిమాండ్
- సబ్బవరం సీఐ పిన్నింటి రమణ

సబ్బవరం: మండలంలోని పలు గ్రామాల్లో అక్రమ మద్యంతో పట్టుబడిన వ్యక్తులపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పిన్నింటి రమణ శుక్రవారం మీడియాకు తెలిపారు. గురువారం వేర్వేరు చోట్ల జరిపిన తనిఖీల్లో పైడివాడ అగ్రహారంలో రూ.2,820 విలువైన 14 మద్యం బాటిళ్లు, అనకపల్లి జంక్షన్ వద్ద రూ.1,800 విలువ చేసే 10 మద్యం బాటిళ్లు, గొర్లివానిపాలెంలో రూ.1,160 విలువ చేసే 8 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని ఆ ముగ్గురిపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఇటీవల గొటివాడ సమీపంలో రూ.25,772 విలువ చేసే 185 మద్యం బాటిళ్లతో దొరికిన పి.సంతోష్‌కుమార్, ఎం.నవీన్‌కుమార్‌లపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. అనకపల్లి ఫ్లైఓవర్ సమీపంలో అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరి నుంచి రూ.29,628 విలువ చేసే 72 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, జి.ఎర్రినాయుడు, జె.అప్పారావులను కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు వెల్లడించారు. బెల్ట్ షాపుల నిర్వహణపై తరచూ తనిఖీలు చేయనున్నట్లు తెలిపారు. బెల్ట్ దుకాణాల పేరిట అక్రమ మద్యం విక్రయించే వారిని ఉపేక్షించేది లేదన్నారు. బెల్ట్ షాపులకు వేలం నిర్వహిస్తున్నట్లు అక్కడక్కడా వినిపిస్తోందని, అలాంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రజలు కూడా తమకు సహకరించాలని కోరారు. ఎక్కడైనా మద్యం బెల్ట్ షాపులున్నా, బెల్ట్ దుకాణాల నిర్వహణకు బహిరంగ వేలం పాటలు నిర్వహించినట్లు తెలిసినా తమకు సమాచారం అందిస్తే, వారి వివరాలు గోప్యంగా ఉంచి, చర్యలు తీసుకుంటామని సీఐ పేర్కొన్నారు.

ఘనంగా శరగడం జన్మదిన వేడుకలు



శరగడం చినఅప్పలనాయుడు జన్మదిన వేడుకల్లో స్థానిక నాయకులు

పెందుర్తి: 96వ వార్డు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, రూరల్ జిల్లా మాజీ అధ్యక్షుడు శరగడం చినఅప్పలనాయుడు పుట్టినరోజు వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. పార్టీలకతీతంగా నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద ఎత్తున ఈ వేడుకల్లో పాల్గొన్నారు. చినఅప్పలనాయుడుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా లయోలా వృద్ధాశ్రమంలో వృద్ధులకు భోజనాలు అందించారు. శివాలయంలో అయ్యప్ప మాలధారులకు భిక్ష ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్యే కర్రి సీతారామ్, పెందుర్తి ఎంపీపీ మధుపాడ నాగమణి, జెడ్పీటీసీ ఉప్పిలి దేవి, ఉప్పిలి కనకరాజు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఇ.నాగేశ్వరరావు తదితరులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

వైభవంగా నృసింహ హోమం



కలశాన్ని శిరస్సుపై ఉంచి ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు సాతులూరి నరసింహాచార్యులు



చక్రపెరుమాళ్లకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి జన్మనక్షత్రం స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని శుక్రవారం సింహగిరిపై శ్రీ నృసింహ హోమం ఘనంగా జరిగింది. ఉదయం 7 గంటల నుంచి ఆలయ కల్యాణమండపంలో అర్చకులు హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేదికపై చక్రపెరుమాళ్లని అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, షోడశోపచారపూజలు జరిపారు. పూజలో పాల్గొన్న భక్తులకు కంకణధారణ చేసి హోమగుండం వద్ద వేంజేపచేశారు. మండపారాధన, అగ్నిప్రతిష్ట, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించి, కుంభప్రోక్షణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందించారు. ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకులు సాతులూరి నరసింహాచార్యులు తదితరుల ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

ఠాగూర్ ఫార్మా ప్రమాదంపై సమగ్ర విచారణ జరపాలి



ఫార్మా ప్రమాదాలపై లంకెలపాలెంలో రాస్తారోకో నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

- మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారమివ్వాలి
- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి డిమాండ్

పరవాడ: స్థానిక ఫార్మాసిటీలోని ఠాగూర్ ఫార్మాలో విషవాయువులు లీకై మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం చెల్లించాలంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం లంకెలపాలెం జంక్షన్లో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపి, యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకూ ఇద్దరు కార్మికులు మరణించగా, మరో కార్మికుడు టి.చిన్నికృష్ణ పరిస్థితి విషమంగా ఉందన్నారు. ఈ ఘటనలో బాధితులకు సకాలంలో వైద్య సేవలు అందించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. ఫార్మా పరిశ్రమల్లో కార్మికుల ప్రాణాల రక్షణ, భద్రతా ప్రమాణాలు పాటించడంలో ఫార్మా కంపెనీలు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నాయని ధ్వజమెత్తారు. ప్రమాదాలు జరిగినప్పుడు కమిటీలు వేసి చేతులు దులుపుకోవడం తప్ప, వాటిపై సమగ్ర విచారణ జరిపిన దాఖలాల్లేవని ఆక్షేపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం పరిశ్రమల భద్రతపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

అనంతుడి దీపోత్సవానికి ప్రత్యేక బస్సులు

సింహాచలం: అనంత పద్మనాభస్వామి దీపోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మధ్యాహ్నం 12.30 గంటల నుంచి సింహాచలం నుంచి పద్మనాభం వరకు ప్రత్యేక ఆర్టీసీ బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు సింహాచలం ఆర్టీసీ డిపో మేనేజర్ రాజశేఖర్ శుక్రవారం మీడియాకు తెలిపారు. సింహాచలం పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. దీపోత్సవం నేపథ్యంలో సింహాచలం నుంచి విజయనగరం, విజయనగరం నుంచి సింహాచలం తిరిగే రెగ్యులర్ బస్సులు వయా ఆనందపురం, తగరపువలస మీదుగా రాకపోకలు సాగిస్తాయన్నారు. ఈ విషయాన్ని రాకపోకలు సాగించే ప్రయాణికులు గమనించాల్సిందిగా కోరారు.